
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 15 । జూలై । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజి నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4000, మధ్య డెల్టాకు 260, పశ్చిమ డెల్టాకు 5000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



వనదుర్గకు చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు.

రూపులమ్మకు సారె



ఏలేశ్వరం: ఏలేశ్వరం గ్రామదేవత రూపులమ్మ అమ్మవారికి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మాతృ శక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల సభ్యులు శుక్రవారం 108 రకాల పిండి వంటలతో సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

రైల్వే లైనుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



సమావేశంలో పాల్గొన్న సమితి ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులకు బదులు భూసేకరణ బాధ్యత తీసుకోవాలనే నిర్ణయం హర్షణీయమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ అభివృద్ధి ఐక్యత పరిరక్షణ సమితి పేర్కొంది. సమితి కార్యాలయంలో ప్రధాన ప్రతినిధులు కేబీఆర్ నాయుడు, నల్లా విష్ణుమూర్తి ఆధ్వర్యాన శుక్రవారం జరిగిన సమావేశం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించింది. తమ సమితి బృందం ఇటీవల రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విజయవాడలో కలిసిందని, ఆయన ద్వారా కోనసీమ రైల్వే లైను నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమాచారం తెలియజేశామని నాయుడు తెలిపారు. రైల్వే లైను భూసేకరణ బాధ్యతను తీసుకుంటున్నట్టు మంత్రి పినిపే విశ్వరూప్ ప్రకటించిన నేపథ్యంలో సమితి నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమితి ప్రతినిధులు వంటెద్దు బాబీ, నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి పర్యటన

ముమ్మిడివరం: జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ శనివారం ముమ్మిడివరంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఎయిమ్స్ కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేస్తున్న నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొంటారు. పల్లిపాలెంలో హౌసింగ్ లే అవుట్‌ను సందర్శిస్తారు.


కలెక్టర్ మాస్టారు



కొత్తూరు హైస్కూల్‌లో పాఠాలు చెబుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

రామచంద్రపురం: రోజువారీ పరిపాలన వ్యవహారాల్లో బిజీగా ఉండే కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం టీచర్ అవతారం ఎత్తారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు కొత్తూరులోని టంగుటూరి ప్రకాశం పంతులు మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన పాఠశాలలో నాడు–నేడు పనులు, ఐఎఫ్ ప్యానెల్ వంటి వాటిపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు కొద్దిసేపు పాఠాలు బోధించారు. టోఫెల్ గురించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓలు ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలపై పవన్, చంద్రబాబు దాడి



ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు రామారావు

అల్లవరం: సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు టీడీపీ, జనసేన, వాటి అనుకూల మీడియా కలిసి కుట్ర చేస్తున్నాయని ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు జున్నూరి రామారావు అన్నారు. డి.రావులపాలెంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. లబ్ధిదారులకే నేరుగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థలపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేస్తున్న దాడి హేయమని అన్నారు. సంక్షేమ క్యాలెండర్‌ను తు.చ. తప్పకుండా అమలు చేస్తూ ప్రజాదరణ పొందుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వారు వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని, దీనిని ప్రజలు నమ్మకపోవడంతో ఆయన సృష్టించిన వ్యవస్థలపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే పవన్ కల్యాణ్ ఏలూరు వారాహి యాత్రలో వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. చంద్రబాబు కోసం పరితపిస్తున్న పవన్ కల్యాణ్.. ఆయన ఉచ్చులో చిక్కుకుని ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కరోనా సమయంలో వలంటీర్ల సేవలను దేశ వ్యాప్తంగా కీర్తిస్తే కనపడలేదా అని ప్రశ్నించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో టీడీపీ గ్రాఫ్ పడిపోవడంతో, దానిని కాపాడుకోవడానికి, వచ్చే ఎన్నికల నాటికి జనసేన ప్రభావం లేకుండా చేయడానికే చంద్రబాబు ఈ దాడి చేయిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 56 శాతం ఓట్లు సాధిస్తుందని జాతీయ సర్వేలు వెల్లడిస్తున్నాయని, ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై దుష్టచతుష్టయం కుట్రలకు పాల్పడుతోందని రామారావు చెప్పారు. వారాహి అమ్మవారి పేరు పెట్టుకున్న వాహనంపై నుంచి పవన్ కల్యాణ్ అన్నీ అబద్ధాలే ఆడుతున్నారని, ఇది ఆయన పతనానికి నిదర్శనమని విమర్శించారు.

జ్వరంపై సమరం



ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది



దోమల లార్వా పెరిగే ప్రాంతాలను గుర్తిస్తున్న సిబ్బంది

- డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్లపై వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తం
- ప్రజల ఆరోగ్య అంశాలపై ప్రత్యేక సర్వే
- మందులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

రాయవరం: వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం. సాధారణంగా సీజనల్ వ్యాధులైన డెంగీ, వైరల్ ఫీవర్లు, మలేరియా, టైఫాయిడ్ వంటివి ఈ సమయంలో అధికంగా ప్రబలుతూంటాయి. వర్షాల వలన ఏర్పడే అపరిశుభ్ర వాతావరణంతో వ్యాధులు వస్తూంటాయి. ఈ పరిస్థితులపై ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమైంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది. అవసరమైన మందులు కూడా సిద్ధం చేస్తోంది.

50వ రౌండ్ ఫీవర్ సర్వే

రోగ లక్షణాలున్న వారిని గుర్తించి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, కింది స్థాయి సిబ్బంది ఇప్పటికే 50వ రౌండ్ ఫీవర్ సర్వే చేపట్టారు. జిల్లాలోని 46 పీహెచ్‌సీలు, 9 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 7 అర్బన్ హెల్త్ సెంటర్లు, 471 సచివాలయాల పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, 48 వార్డు హెల్త్ క్లినిక్‌ల పరిధిలో ఈ నెల 12న ఈ సర్వే ప్రారంభించారు. సర్వేలో 545 ఏఎన్ఎంలు, 432 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, 1,455 మంది ఆశా కార్యకర్తలు పాల్గొంటున్నారు. నెలాఖరు వరకూ జిల్లా వ్యాప్తంగా జ్వర లక్షణాలున్న వారందరి రక్తాన్ని సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తారు. జ్వరాలు నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటారు. అలాగే, వైద్య సిబ్బంది నిత్యం పలు బృందాలుగా విడిపోయి ప్రజల ఆరోగ్య అంశాలపై ఆరా తీస్తున్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పరిసరాల శుభ్రత, పారిశుధ్య పనులపై పంచాయతీ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకూ జరిగిన సర్వేలో జిల్లా వ్యాప్తంగా ఆరు సింథమాటిక్ కేసులు గుర్తించారు. చొప్పెల్ల, ఊబలంక, అయినవిల్లి, కొత్తలంక పీహెచ్‌సీల పరిధిలో ఒక్కొక్కటి, అమలాపురం పీహెచ్‌సీ పరిధిలో రెండు జ్వర అనుమానిత కేసులను గుర్తించారు. గత ఏడాది అమలాపురం సబ్ యూనిట్ ఆఫీసు పరిధిలో 6, రాజోలులో 4, కొత్తపేట 16, మండపేట పరిధిలో 46 కలిపి జిల్లాలో మొత్తం 72 డెంగీ కేసులు నమోదయ్యాయి.

అవగాహన కల్పిస్తూ..

వానాకాలంలో నిల్వ, మురుగు నీటిలో దోమలు ఇట్టే వ్యాప్తి చెందుతాయి. దీనివలన వచ్చే వ్యాధులపై ప్రజలకు వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. వర్షాకాలంలో కలుషిత నీరు, దోమల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. కాచి, చల్లార్చి, వడబోసిన నీరు తాగాల్సిందిగా సర్వే చేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నారు. నీటిలో పెరిగే ఏడిస్ ఈజిప్టై దోమ వల్ల డెంగీ జ్వరం వస్తుంది. ఈ దోమలు ఉదయం వేళల్లో కాటు వేస్తాయని, దీనివల్లనే డెంగీ జ్వరం వచ్చే అవకాశం ఉంటుందని అవగాహన కల్పిస్తున్నారు. సకాలంలో చికిత్స చేయించకుంటే రక్తకణాలు తగ్గి, మరణించే ప్రమాదం ఉంటుందని వివరిస్తున్నారు. డెంగీ జ్వరం వచ్చిన వారిలో కాళ్లు కదిలించలేని పరిస్థితి ఉంటుందని, ఎముకలు, కండరాల్లో తీవ్రమైన నొప్పులు, కొందరికి శరీరంపై మచ్చలు, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయని, అటువంటి వారు వెంటనే సమీప పీహెచ్‌సీల్లో చికిత్స పొందాలని సూచిస్తున్నారు.

ఫ్రైడే.. డ్రైడే

వైద్య, ఆరోగ్య శాఖ ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పరిగణిస్తోంది. ఆ రోజు ఆశా కార్యకర్తలు, వలంటీర్, ఏఎన్ఎం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జ్వరాలపై అవగాహన కల్పిస్తున్నారు. పాడైపోయిన టైర్లు, కొట్టి పారేసిన కొబ్బరి బొండాలు, కొబ్బరి చిప్పలు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, వాటర్ హెడ్ ట్యాంకుల్లో దోమ లార్వా అధికంగా వ్యాప్తి చెందుతుంది. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో ఇటువంటి ప్రాంతాలను గుర్తిస్తున్నారు. దోమ లార్వా అధికంగా పెరిగే నీటి కుంటలు, చెత్తకుప్పలకు వలంటీర్ ఫొటోలు తీసి, ఏఎన్ఎం యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అక్కడి నుంచి ఆ ఫొటోలు సెక్రటరీ లాగిన్‌లోకి వెళ్తాయి. వెంటనే సచివాలయ సెక్రటరీ చర్యలు తీసుకుంటారు. ఆయా ప్రాంతాల్లో లార్వా అభివృద్ధి చెందకుండా పారిశుధ్యాన్ని మెరుగు పరుస్తారు.

జాగ్రత్తలు పాటించాలి



ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జిల్లా వ్యాప్తంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచుతున్నాం. జిల్లా వ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. అధిక సంఖ్యలో జ్వర బారిన పడిన కేసులు గుర్తిస్తే వెంటనే అక్కడ ప్రత్యేక క్యాంపుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ దుర్గారావుదొర, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

శాకంబరీదేవిగా శ్రీదేవి



అమలాపురం శ్రీదేవి **మార్కెట్‌లో** కొలువు తీరిన **శ్రీదేవి అమ్మవా**రిని ఆషాఢ **మాసం సందర్భం**గా శాకం**బరీదేవిగా శుక్ర**వారం **అలంకరించారు**. శ్రీదేవి **ఉత్సవ కమిటీ** చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు, అమ్మవారి సేవకుల ఆధ్వర్యాన కూరగాయలను మాలలుగా కట్టి చేసిన ఈ అలంకరణ భక్తులను పరవశుల్ని చేసింది. అమ్మవారితో పాటు మొత్తం ఆలయాన్ని కూడా కూరగాయలు, పండ్ల తోరణాలతో కళాత్మకంగా తీర్చిదిద్దారు. శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీదేవి అమ్మవారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు.

– అమలాపురం టౌన్

భారీ సారె



అమ్మవారికి తీసుకువచ్చి సారెతో మహిళా భక్తులు

మధురమైన మైసూర్‌పాక్‌లు.. నోరూరించే మడత కాజాలు.. రుచికరమైన బూందీలడ్డూలు.. రవ్వల డ్డూలు.. వేడివేడి బూరెలు.. జంతికలు.. చక్కిలాలు.. గారెలు.. అరటి, మామిడి వంటి రకరకాల పండ్లు.. ఇలా రకరకాల పిండి వంటలు, పండ్లతో యానాం గోపాల్ నగర్ కొలువైన శారదా దేవి అమ్మవారికి భక్తులు శుక్రవారం భారీ సారె సమర్పించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వందలాదిగా మహిళా భక్తులు తమ ఇంటి వద్ద 150 రకాల పిండి వంటలు తయారు చేశారు. వాటిని స్థానిక నల్లచెరువు ప్రాంతం నుంచి గోపాల్‌నగర్, గాంధీనగర్ మీదుగా మేళతాళాలు, నాదస్వర ఘోష నడుమ భారీ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అనంతరం అ మ్మవారికి విశేష పూజలు, లలితా సహస్రనామ పా రాయణ తదితర కార్యక్రమాలు, ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు వాసు, వేగేశ్న గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

– యానాం

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలనూ వెంటనే ఉచితంగా అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని చప్పిడివారి సావరం సచివాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మంత్రి వేణు పాల్గొని లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలు తెలిసిన వారని చెప్పారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సచివాలయ పరిధిలోని 14, 15, 16 వార్డుల్లో 1,580 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పెంటపాటి దేవి శ్రీనివాస్, పోతంశెట్టి వెంకట శ్యామలతకృష్ణ, వాడ్రేవు సాయిప్రసాద్, కేతా శ్రీను, బొక్కా వీర వెంకట సత్యనారాయణ, బావాల మంగామణి భద్రరావు, కుడిపూడి లలితా గణేష్, సచివాలయ కన్వీనర్లు పసుపులేటి సత్తిబాబు, అక్కల ఠాగూర్, కంచుమర్తి బాబూరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

యువకులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

అల్లవరం: అవకాశాలను అందిపుచ్చుకుని దేశాభివృద్ధికి తోడ్పాటునందించాలని యువతకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్రం, నవభారత యువ నిర్మాణ సంఘ్ ఆధ్వర్యాన ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం యువ ఉత్సవ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగ పాల్గొన్న ఇజ్రాయిల్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ, యువత కేవలం చదువు పైనే దృష్టి సారించాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. చెడు వ్యసనాలకు బానిసలైతే విద్యార్థి జీవితం అంధకారంలోకి వెళ్లిపోతుంద, ఆ దిశగా వెళ్లకూడదని హితవు పలికారు. అనంతరం పంచప్రోన్ ఆఫ్ అమృతకాల్ అనే అంశంపై జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్పీ శ్రీధర్ బహుమతులు అందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టీవీ జనార్దనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఆల్డా చైర్మన్ దొరబాబు, బీవీసీ అధినేత బోనం కనకయ్యలను నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ అమృతేష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ్ అధ్యక్షుడు బొంతు ఉదయ్‌కుమార్, కార్యదర్శి నాగమణి, గౌరవాధ్యక్షుడు పాటి సత్తిబాబు, సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ శ్రీధర్, కో ఆర్డినేటర్ అమృతేష్ తదితరులు

మెగా జాబ్ మేళాలో 225 మందికి ఉద్యోగాలు



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యాన స్థానిక మిరియాం కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 225 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. ఈ మేళాకు 670 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. దీనిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రారంభించారు. ఆయన, అమలాపురం ఆర్‌డీఓ వసంతరాయుడు మాట్లాడుతూ, యువతలో పలు రకాల నైపుణ్యాలను గుర్తించి, వారికి సరైన శిక్షణ ఇచ్చి, ఉపాధి మార్గాలు చూపించడం అభినందనీయమని ప్రశంసించారు. కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన స్కిల్ హబ్, ఉచిత శిక్షణ, ప్లేస్‌మెంట్స్ ప్రోగ్రామ్‌ను కూడా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ప్రారంభించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి వసంతలక్ష్మి, ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకమాన్, ప్రతినిధి నాగబాబు, ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు కూడా ప్రసంగించారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన సత్రానికి రూ.40 లక్షల విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రానికి హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్వాహకులు శుక్రవారం రూ.40 లక్షల విరాళం సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని అందజేశారు. వాడపల్లి వెంకన్న సన్నిధిలో సుమారు రూ.5.50 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి ఇటీవలే శంకుస్థాపన చేశారు. దీనికి తమ వంతు విరాళం అందజేసిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్వాహకులకు చైర్మన్, ఈఓలు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేసి, అభినందించారు.

చెంబు, పాత్రంతో దాడి.. భర్త హతం

అయినవిల్లి: తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు పడుతున్న భర్త.. భార్య చేతిలో హతమయ్యాడు. సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎస్.నాగేశ్వరరావు, స్థానికుల కథనం ప్రకారం.. అయినవిల్లిలంకకు చెందిన ఇసుకపట్ల రామకృష్ణ (34) కొబ్బరి దింపు తీస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాగుడుకు బానిసైన అతడు తరచూ ఇంట్లో భార్య సత్యనారాయణమ్మ, కుమార్తె అఖిలశ్రీ, కుటుంబ సభ్యులతో గొడవ పడుతూండేవాడు. గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన రామకృష్ణ.. భోజనం పెట్టమంటూ భార్య, కుమార్తెలను అసభ్యకరంగా దుర్భాషలాడాడు. దీంతో విసుగు చెందిన సత్యనారాయణమ్మ.. భర్త రామకృష్ణ తలపై చెంబు, సన్నికల్లు పాత్రంతో మోదింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. రామకృష్ణ తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రామకృష్ణ మృతదేహానికి పంచానామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం అమలాపురంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడి కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సేవా సైన్యానికి మద్దతు

- వలంటీర్లకు భరోసానిస్తూ జెడ్పీ సమావేశంలో తీర్మానం
- వారిపై దుష్ప్రచారాన్ని ఖండించిన నేతలు
- వ్యవసాయం, ఇరిగేషన్, సీజనల్ వ్యాధులపై చర్చ

కాకినాడ సిటీ: గ్రామ/వార్డు వలంటీర్లపై దుష్ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని, వారికి మద్దతుగా నిలవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన శుక్రవారం ఈ సమావేశం నిర్వహించారు. వలంటీర్ వ్యవస్థ, ఖరీఫ్ సాగు ప్రణాళిక, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం, ఇరిగేషన్ కార్యాచరణ, కౌలు రైతులకు రుణాలు, సీజనల్ వ్యాధుల కట్టడి, విద్యుత్ సరఫరా వ్యవస్థలు, ఉపాధి హామీ పథకం పనులు తదితర అంశాలపై చర్చించారు. ఆయా శాఖలకు సంబంధించి తమ ప్రాంత అంశాలను జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తగా అధికారులు వివరణ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను వివరించారు.

వెదజల్లు సాగు మేలు

ఖరీఫ్‌ను విజయవంతంగా ముగించేందుకు చేపట్టాల్సిన కార్యచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. లోటు వర్షపాతం, ఖరీఫ్ ప్రారంభ పనులపై ప్రభావం, విత్తనాలు, ఎరువుల అందుబాటు, సాగునీటి కాలువల ద్వారా నీటి ప్రవాహం ఆయకట్టు చిట్టచివరి వరకూ చేరేందుకు చేపట్టాల్సిన పనులు, సీసీఆర్‌సీ కార్డులు, కౌలు రైతులకు రుణాలు, కాలువల్లో తూటికాడ, గుర్రపుడెక్క తొలగింపు, డ్రైన్ల ఆధునీకరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఇప్పటి వరకూ లోటు వర్షపాతం నమోదైందని, ఇప్పుడిప్పుడే వానలు కురుస్తున్నాయని, ఈ నేపథ్యంలో నారుమళ్లు కాకుండా నేరుగా వెదజల్లే పద్ధతి అనుసరిస్తే బాగుంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. దీనిపై గ్రామసభలు పెట్టి, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. మెట్ట ప్రాంతాల్లో రాగుల వంటి చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామని, విత్తనాలు కూడా సరఫరా చేశామని తెలిపారు. భూసార పరీక్షల నమూనాలు 10 వేల వరకూ తీశామన్నారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ, జిల్లాలోని కౌలు రైతులకు గత ఏడాది 40 వేల సీసీఆర్‌సీ కార్డులు అందించామని, ఈసారి ప్రతి కౌలు రైతుకూ కార్డు అందించి, త్వరితగతిన రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే 36 వేల కార్డులు అందించామని వెల్లడించారు. భూ యజమానులు దూర ప్రాంతంలో ఉంటే వీడియో కాల్ ద్వారా అంగీకారం తీసుకునే వెసులుబాటు కూడా ఉందన్నారు. కౌలు రైతులను గుర్తించేందుకు వలంటీర్, వీఏఏ ఇంటింటి సర్వే చేస్తున్నారని చెప్పారు.

వలంటీర్లపై ఆరోపణలకు ఖండన

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ, వలంటీర్ వ్యవస్థపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వీటిని ఖండించడంతో పాటు మేమున్నామంటూ వలంటీర్లకు భరోసా కల్పించేలా, ఈ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపేలా తీర్మానం చేయాలని కోరారు. దీనిపై రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, ప్రతిపక్ష నేతగా నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్రలో దాదాపు 2 కోట్ల మంది ప్రజలను కలిసి, వారి కష్టాలను గుర్తించి, వాటిని పరిష్కరించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్/సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసిన ఈ వ్యవస్థలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఇలాంటి వ్యవస్థపై కొందరు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ, వలంటీర్లకు అందరూ మద్దతుగా నిలవాల్సిన అవసరముందని అన్నారు. ఈ తీర్మానానికి మద్దతుగా కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడారు. అనంతరం ఇది చారిత్రక తీర్మానమని పేర్కొంటూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సమావేశంలో ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు వేణు, దాడిశెట్టి రాజా, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీ వంగా గీత, విప్ జగ్గిరెడ్డి, కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా

వ్యాధుల కట్టడికి చర్యలు

సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ కట్టడికి క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు, పారిశుధ్యం, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు, ఆస్పత్రుల్లో ర్యాపిడ్ కిట్ల అందుబాటు తదితర అంశాలపై కూడా జెడ్పీ సమావేశంలో చర్చించారు. కాకినాడ రూరల్, కోటనందూరు తదితర ప్రాంతాల్లో ఫైలేరియా కేసులు నమోదవుతున్నందున జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, సర్వే చేయాలని నిర్ణయించారు. వైద్య సేవలు పొందేందుకు పేదలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని మంత్రి వేణు అన్నారు. ఈ నాలుగేళ్లలో రికార్డు స్థాయిలో దాదాపు 51 వేల మంది వైద్య సిబ్బందిని నియమించారని చెప్పారు. వైద్య సేవల్లో ఎక్కడా లోటుపాట్లు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఖాళీలను భర్తీ చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ సందర్భంగా డెంగీ నివారణ మాసోత్సవాలపై వైద్య, ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను మంత్రులు రాజా, వేణు, విప్ జగ్గిరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆవిష్కరించారు.

నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ఇళ్ల మంజూరు, గ్రౌండింగ్, లే అవుట్లలో మౌలిక వసతుల కల్పన, ఉపాధి హామీ పథకం కింద ప్లాంటేషన్ పనులపై సమావేశంలో చర్చించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ సమావేశానికి తొలిసారి హాజరైన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావును మంత్రులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. సమావేశంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు, ఎం.పద్మలత, సీఈఓ ఎ.రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కియా సెల్టోస్ 2.0 కారు మార్కెట్‌లోకి విడుదల



కియా సెల్టోస్ 2.0 కారును మార్కెట్‌లోకి విడుదల చేసిన కంటిపూడి సర్వారాయుడు

రాజమహేంద్రవరం సిటీ: సరికొత్త ఫీచర్లతో రూపొందించిన కియా సెల్టోస్ 2.0 కారును మార్కెట్‌లోకి విడుదల చేసినట్టు కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు తెలిపారు. రాజమహేంద్రవరం, కాకినాడ కంటిపూడి కియా షోరూముల నుంచి ఈ కారును శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కారులో 32 సేఫ్టీ ఫీచర్లు, 17 అటానమస్ అడాస్ లెవెల్ 2 ఫీచర్లు, పనోరమిక్ సన్ రూఫ్, డ్యూయల్ స్క్రీన్ పనోరమిక్ డిస్‌ప్లే, అత్యాధునిక 67 కియా కనెక్ట్ ఫీచర్స్ డ్యూయల్ జోన్ ఆటోమేటిక్ ఏసీ, 6 ఎయిర్ బ్యాగ్‌ల వంటి అనేక ఫీచర్లు ఉన్నాయని సర్వారాయుడు చెప్పారు. పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో 5 ట్రాన్స్మిషన్స్‌తో అందుబాటులో ఉందన్నారు. విడుదలయిన మూడేళ్లలో 5 లక్షల సెల్టోస్ కార్లు, 10 లక్షల కియా కార్లు అమ్ముడయ్యాయని తెలిపారు. కేకోడ్ ద్వారా బుక్ చేసుకునే వినియోగదారులకు డెలివరీలో ప్రాధాన్యం లభిస్తుందన్నారు. బుకింగ్స్ ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్ డైరెక్టర్లు కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి (చినబాబు), కె.మన్మోహనరామ్, కియా ఏరియా మేనేజర్ గౌతమ్ సాయి, మేనేజర్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ మైండ్‌లో చిప్ పాడైపోయింది

- ప్రతిపక్షంలోనైనా ఉండాలంటే ప్రవర్తన మార్చుకోవాలి
- రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

నిడదవోలు: వారాహి యాత్రలో పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు చూస్తుంటే ఆయన మైండ్‌లో చిప్ పాడైనట్లు అర్థమవుతోందని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి శుక్రవారం ఆయన ఆషాఢం సారె సమర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థ ఉన్నప్పుడు సచివాలయాలు ఎందుకంటూ పవన్ అసంబద్ధంగా మాట్లాడుతున్నారన్నారు. అర్థం లేని ప్రసంగాలు చేసి ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియదన్నారు. రాష్ట్ర అభివృద్ధిని పవన్ కోరుకోవడం లేదని, తిరోగమన దిశలో వెళ్లాలని చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు తొత్తులుగా ఉన్న జేబులు కొట్టే ముఠా, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకునే ముఠా కావాలని పవన్ కోరుకుంటున్నారని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నువ్వు అంటూ సంబోధించిన మాత్రాన ఆయన విలువ తగ్గదన్నారు. ఆయనను విమర్శిస్తే ఆకాశం మీద ఉమ్మి వేసినట్లేనన్నారు. అది నీమీదే పడుతుందన్న విషయం గ్రహించాలన్నారు. చంద్రబాబు అనే శనిని నెత్తిన పెట్టుకుని యాత్రలు చేసినంత కాలం పవన్ బతుకూ అలాగే ఉంటుందని దుయ్యబట్టారు. కనీసం ప్రతిపక్ష నాయకుడిగా అయినా ఉండాలంటే పవన్ కల్యాణ్ ఆలోచనా ధోరణి మారాలని మంత్రి హితవు పలికారు. ప్రతిపక్షంలోనైనా ఉంటానా అనే భయం చంద్రబాబుకు పట్టుకుందని, దీంతో రాజకీయంగా పవన్‌ను కూడా తప్పుదోవ పట్టిస్తున్నాడని అన్నారు. దేశంలోనే ఆదర్శంగా ఉన్న వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రధాని సైతం మెచ్చుకున్నారని అన్నారు. ఈ వ్యవస్థల ద్వారా ప్రజలకు జరుగుతున్న మేలును గమనించి, వారిపై పవన్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఆలోచనలు, విధానాలను అందుకోవాలంటే మీలో మార్పు రావాలని మంత్రి సత్యనారాయణ హితవు పలికారు. ఆయన వెంట ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు తదితరులున్నారు.

49 రోజుల పాటు 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలు

అమలాపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు 'ఆడుదాం ఆంధ్ర' పేరిట గ్రామ నుంచి రాష్ట్ర స్థాయి వరకూ 49 రోజుల పాటు ఐదు విడతలుగా క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ/వార్డు, మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ ఆటలు జరగనున్నాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచే మంచి క్రీడాకారులను తయారు చేసేలా అధికారులు, క్రీడా ప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో ప్రొఫెషనల్ క్రికెట్ ఆడించే పరిస్థితి ఆకాంక్షించారన్నారు. వివిధ క్రీడా పోటీల నిర్వహణకు ప్రతి మండలంలోనూ క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాల్సిందిగా సీఎం ఆదేశించారని తెలిపారు. పురుషులు, మహిళలకు బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి వాటితో పాటు సంప్రదాయ క్రీడా పోటీలు జరగనున్నాయని తెలిపారు. అన్ని పోటీలు నాకౌట్ విధానంలో జరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: చొల్లంగి వద్ద జాతీయ రహదారి 216పై శుక్రవారం జరిగిన ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కోరింగ పోలీసుల కథనం ప్రకారం.. యానాం వైపు నుంచి కాకినాడ వైపు ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. గేదె అడ్డం రావడంతో దానిని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆ యువకులతోపాటు ఆటో డ్రైవర్, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన యువకులు స్థానిక ఒక కళాశాలలో చదువుతున్న విద్యార్థులని తెలిసింది. ప్రమాద తీవ్రతకు ఆటో, బైక్ నుజ్జునుజ్జయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎడ్‌సెట్‌లో తేజస్వినికి 4వ ర్యాంక్



రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన కంచుమర్తి తేజస్విని రాష్ట్ర స్థాయి 4వ ర్యాంక్ కైవసం చేసుకుంది. గణితం విభాగంలో 150 మార్కులకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తేజస్విని 90 మార్కులు సాధించి ఓపెన్ కేటగిరీలో ఈ ర్యాంక్ సాధించింది. తాను ఉపాధ్యాయ శిక్షణ పొందుతానని, అయితే గ్రూప్–1 సాధించాలన్నది లక్ష్యమని ఈ సందర్భంగా తేజస్విని తెలిపింది. ఆమె తండ్రి సాయి కిషోర్ ప్రైవేటు ఉద్యోగి కాగా, తల్లి శారద గృహిణి.

ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అడ్మిషన్ల కన్వీనర్ వేణుగోపాలవర్మ శుక్రవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో ప్రభుత్వ లేదా ప్రైవేటు కళాశాల ఆప్షన్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐకి వచ్చే నెల 3, 4 తేదీల్లోను, ప్రైవేటు ఐటీఐలకు 5, 6, 7 తేదీల్లోను కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వివరించారు. సందేహాల నివృత్తికి 9494 688 516 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నానా కష్టాలూ పడి.. క్షేమంగా స్వస్థలానికి..

అమర్‌నాథ్ నుంచి తిరిగిన వచ్చిన జిల్లా వాసులు



స్వగ్రామానికి చేరుకున్న బద్రి బాబ్జీ తదితరులు

సాక్షి, అమలాపురం: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లి, జమ్మూ కశ్మీర్‌లో చిక్కుకుపోయిన జిల్లా వాసులు శుక్రవారం స్వస్థలాలకు క్షేమంగా చేరుకున్నారు. జిల్లాలోని అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాలకు చెందిన 45 మందితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలకు చెందిన మరో 40 మంది యాత్రికులు ఈ నెల 7న అమర్‌నాథ్ యాత్రకు వెళ్లారు. వైష్ణోదేవి కాట్రా వెళ్లిన వీరు అక్కడి నుంచి అమర్‌నాథ్ వెళ్తున్న సమయంలో భారీ వర్షాలు కురవడంతో పాటు కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో వీరందరూ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన బెతల్ బేస్ క్యాంప్ వద్ద చిక్కుకుపోయారు. ఒకవైపు భారీ వర్షం, మరోవైపు ఎముకలు కొరికే చలితో నానా కష్టాలూ పడ్డారు. మూడు రోజుల పాటు అక్కడే ఉండిపోయారు. యాత్రకు అనుమతిచ్చేది లేదని అధికారులు చెప్పడంతో వీరందరూ జమ్మూ వెళ్లి అక్కడి నుంచి స్వస్థలాలకు చేరాలని భావించారు. అయితే దారి అనుకూలించకపోవడంతో శ్రీనగర్ వెళ్లిపోయారు. కొందరు అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవగా, మూడు రోజుల తరువాత వాతావరణం అనుకూలించడంతో యాత్రకు అనుమతి ఇచ్చారు. దీంతో కొందరు యాత్రికులు తిరిగి బెతల్ క్యాంపునకు చేరారు. అయితే మరోసారి భారీ వర్షాలు కురవడంతో అమర్‌నాథ్ యాత్రను ఒక రోజు నిలిపివేశారు. తిరిగి మర్నాడు అనుమతివ్వడంతో దర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి శ్రీనగర్ చేరుకుని, విమానంలో తొలుత ఢిల్లీకి, అక్కడి నుంచి విశాఖ చేరుకుని రోడ్డు మార్గంలో స్వగ్రామాలకు క్షేమంగా చేరుకున్నారు. బెతల్ క్యాంపులో చలి తట్టుకోలేకపోయామని, కానీ అక్కడ తాగేందుకు వేడి నీరు, ఆహారం అందించారని వైఎస్సార్ సీపీ ఉప్పలగుప్తం మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ 'సాక్షి'కి చెప్పారు.

ట్రాలీ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

- నుజ్జునుజ్జయిన దేహం
- భయభ్రాంతులకు గురైన స్థానికులు, ప్రయాణికులు



మృతురాలు చిట్టమ్మ (పాత చిత్రం)

గండేపల్లి: ట్రాలీ ఢీకొని ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. మండలంలోని నీలాద్రిరావుపేట వద్ద పదహారో నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదం స్థానికులను, ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేసింది. గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం ప్రకారం .. నీలాద్రిరావుపేటకు చెందిన మట్టాడి చిట్టమ్మ (75), ఆమె కుమార్తె సరోజని జగ్గంపేట వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో చిట్టమ్మ రోడ్డుపై పడిపోయింది. సరిగ్గా అదే సమయానికి వేగంగా వస్తున్న ట్రాలీ ఆమెపై నుంచి దూసుకుపోయింది. ట్రాలీ చక్రాల మధ్య నలిగిపోయి చిట్టమ్మ శరీరం నుజ్జునుజ్జయిపోయింది. శరీరం భాగాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఒంటిపై దుస్తులు తప్ప కనీసం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు కూడా వీలు లేనంతగా మాంసపు ముద్దగా మారిపోయింది. పోలీసులు ఆ మాంసం ముద్దనే మూట కట్టి పోస్టుమార్టానికి తరలించారు. శవపంచనామా నిర్వహించి, మృతురాలి కుమార్తె సరోజని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. చిట్టమ్మ దారుణ మరణంతో ప్రమాద స్థలంలో బంధువులు బోరున విలపించారు. ప్రమాదానికి కారణమైన ట్రాలీని డ్రైవర్ ఆపకుండా పరారయ్యేందుకు ప్రయత్నించగా, స్థానికులు వెంబడించారు. ఆదిత్య హాస్పిటల్ వద్ద అడ్డుకుని, జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావుకు సమాచారం అందజేశారు. ఆయన వెంటనే స్పందించి, రోడ్డు సేఫ్టీ సిబ్బందిని అప్రమత్తం చేసి ట్రాలీని, డ్రైవర్‌ను గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంఘటన స్థలంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మేలైన పశుగ్రాసాలతో మెరుగైన పాల దిగుబడి



పశుగ్రాసాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మూర్తి తదితరులు

అమలాపురం రూరల్: మేలైన పశుగ్రాసాలతో మెరుగైన పాల దిగుబడి వస్తుందని, తద్వారా పశుపోషణ లాభసాటిగా ఉంటుందని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కర్నీడి మూర్తి అన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ సౌజన్యంతో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఈదరపల్లిలోని జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయం వద్ద జిల్లాలోని 120 మంది రైతులకు వివిధ రకాల పశుగ్రాసాల ఎంపిక, పోషణ విధానాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సహాయ సంచాలకుడు డాక్టర్ ఉమామహేశ్వర రెడ్డి, డాక్టర్ ఎల్.విజయారెడ్డితో పాటు డాక్టర్ మూర్తి మాట్లాడుతూ, పాడి పరిశ్రమ యాజమాన్యంలో 70 శాతం పోషణకే ఖర్చవుతుందని చెప్పారు. నీటి వసతి ఉన్న ఎకరం భూమిలో మంచి నాణ్యమైన సూపర్‌నేపియర్, గినిడో–2, సీఓ4 వంటి పశుగ్రాసాలు పెంచితే ఐదారు పశువులకు సరిపోతుందని వివరించారు. ఎకరం భూమిలో పశుగ్రాసాలు పెంచితే సుమారు రూ.35 వేల ఆదాయం వస్తుందని, అదే వాణిజ్య పంటలైతే రూ.15 వేలు మాత్రమే వస్తాయని తెలిపారు. ప్రభుత్వం 75 శాతం రాయితీపై జొన్న, మొక్కజొన్న, అలసంద వంటి పశుగ్రాస విత్తనాలు అందజేస్తోందన్నారు. వీటిని ఆయా రైతుభరోసా కేంద్రాల ద్వారా పొందవచ్చని చెప్పారు. కాయ జాతి పశుగ్రాసాలైన అలసంద, జనుము, పెసర, పిల్లి పెసర వంటి వాటిని ఎండు మేతగా తయారు చేసుకుని నిలువ చేసుకోవాలని డాక్టర్ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

అమలాపురం రూరల్: వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. అమలాపురం పోలీసుల కథనం ప్రకారం.. అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన బత్తు సత్తిరాజు, దుర్గ దంపతుల కుమార్తె దివ్యరమ్య(20)కి, అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి శివారు మెట్ల కాలనీకి చెందిన బద్రి గంగరాజుకు 23 నెలల కిందట వివాహం జరిగింది. వీరికి ఇంకా సంతానం కలగలేదు. వివాహ సమయంలో అన్ని లాంఛనాలతో పాటు కట్నంగా రూ.1.60 లక్షలు ఇస్తామని రమ్య తల్లిదండ్రులు చెప్పారు. అప్పట్లో రూ.1.10 లక్షలు మాత్రమే ఇచ్చారు. మిగిలిన రూ.50 వేల కోసం భర్త గంగరాజుతో పాటు అత్తింటి వారు రమ్యను వేధిస్తున్నారని ఆమె తండ్రి సత్తిరాజు చెప్పారు. తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్న తాను త్వరలోనే తన కుమార్తె పేరిట రూ.50 వేలు బ్యాంకులో డిపాజిట్ చేస్తానని తెలిపారు. అయినప్పటికీ తన కుమార్తెను భర్త, అత్తింటి వారు వేధిస్తున్నారని చెప్పారు.

ఈ నేపథ్యంలో రమ్య శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త గంగరాజు తన అత్తమామలు దుర్గ, సత్తిరాజులకు ఫోను ద్వారా సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. తమ కుమార్తె ఉరి వేసుకుని చనిపోయేంత పిరికిది కాదని రమ్య తల్లిదండ్రులు చెబుతున్నారు. కట్నం డబ్బుల కోసం తమ కుమార్తెను అత్తింటి వారే హత్య చేశారని వారు ఆరోపిస్తున్నారు. సంఘటన స్థలాన్ని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, రూరల్ సీఐ పి.వీరబాబు సందర్శించారు. వరకట్న వేధింపుల వల్లే రమ్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని డీఎస్పీ చెప్పారు. మృతురాలు రమ్య తల్లి దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పరదేశి తెలిపారు.